ప్రయాణికులకు నీడ కరువు

బస్ షెల్టర్లలో వసతుల లేమి
నిర్వహణను పట్టించుకోని అధికారులు
చెత్తాచెదారం నిండిపోవడంతో
ప్రయాణికులు కూర్చోలేని పరిస్థితి
ఎండావానల్లో బస్సుల కోసం
రోడ్డు పక్కనే విద్యార్థుల పడిగాపులు



8

చిరు వ్యాపారులకే షాపులు కేటాయించండి

టెండర్ పద్ధతితో తీవ్ర అన్యాయం
దీనిద్వారా దుకాణాలు స్థానికులకు
దక్కకుండా పోయే ప్రమాదం
కడ్తాల్ తహసీల్దార్, పాల
శీతలీకరణ కేంద్రం పర్యవేక్షకులకు
వినతి పత్రాల అందజేత



8



ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో
వివిధ రాష్ట్రాల మహిళల వేషధారణలో విద్యార్థినులు

బాలల నేస్తం చాచాజీ

భారత తొలి ప్రధాని దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహించే బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో ప్రముఖులు పాల్గొని విద్యార్థులకు హితబోధ చేశారు. నెహ్రూ ఘనతను వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

8



విద్యుత్ దీపాలంకరణలో
మైసిగండి మైసమ్మ దేవాలయం

మైసిగండి బ్రహ్మోత్సవం

నేటి నుంచి ఉత్సవాలు షురూ

- ఆరు రోజుల పాటు జాతర
- ఆలయంలో పకడ్బందీగా ఏర్పాట్లు

కడ్తాల్ , నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భక్తి విశ్వాసాల ముక్తి ప్రదాత... పేదల ఇలవేల్పు... ఆపద మొక్కుల అమ్మ... శక్తి స్వరూపిణిగా వెలుగొందుతున్న కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే జాతరకు నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మైసమ్మ దేవత బ్రహ్మోత్సవాలు ప్రతిఏటా కార్తీక పౌర్ణమి నుంచి కార్తీక పంచమి వరకు ఆరు రోజులపాటు కనుల పండువగా వేడుకలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

ఏర్పాట్ల పరిశీలన...

మైసిగండి మైసమ్మ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ పరిశీలించారు. ఉత్సవాల్లో భక్తులు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

కార్యక్రమాల వివరాలు

మైసిగండి బ్రహ్మోత్సవాల వివరాలను గురువారం ఆలయ కార్యనిర్వహణ అధికారి స్నేహలత వెల్లడించారు. ఈనెల 15న క్షీరాభిషేకం, విశేష అలంకరణ, కుంభహారతి, 16న చిన్నతేరు, విశేష పూజలు, 17న పెద్ద రథోత్సవం, 18న విశేష పూజలు, అమ్మవారికి బోనాలు, బండ్లు తిప్పుట, శత చండీ హోమం ప్రారంభం, 19న కార్తీక దీపోత్సవం, మహాలింగార్చన, పుష్పార్చన, 20న అమ్మవారికి వివిద కూరగాయాలతో అలంకరణ, ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు.



మైసిగండి ఆలయంలో మైసమ్మ అమ్మవారు

మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తాజాగా రుణ బీమా, ప్రమాద బీమా పథకాలను ప్రవేశ పెట్టి సంఘంలోని సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు ధీమా కల్పించింది. ఏదైనా కారణం చేత సభ్యురాలు చనిపోయినా లేదా వైకల్యం సంభవించినా వారికి, వారి కుటుంబాలకు ఈ ఉచిత బీమా పథకాలను అందిస్తారు. అంతేకాకుండా చనిపోయిన సభ్యులకు సంబంధించిన బకాయిలు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పథకాల ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో లక్షల మంది స్వయం సహాయక సభ్యులు లబ్ధిపొందే అవకాశం లభించింది.



బీమాతో ధీమా

మహిళా సంఘాల సభ్యులకు ఉచిత రుణ, ప్రమాద బీమా

ప్రమాదమైతే రూ.10లక్షలు, సహజ మరణమైతే రూ.2లక్షలు

వంద శాతం వైకల్యమైనా రూ.10లక్షలు వర్తింపు

50 శాతం వైకల్యం చెందితే రూ.5లక్షలు

ఉమ్మడి జిల్లాలో 4,06,350 మంది సభ్యులకు ప్రయోజనం

ఇప్పటికే 69 కుటుంబాలకు బీమా చెల్లించేందుకు నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయి. అయితే ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మహిళా స్వయం సహాయక సభ్యుల కోసం ఉచిత రుణ బీమా, ప్రమాద బీమా పథకాలను అమల్లోకి తీసుకువచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 5లక్షల మందికి పైగా స్వయం సహాయక సభ్యులకు ప్రయోజనం కలగనుంది. ఈ పథకం ద్వారా స్వయం సహాయక సంఘం సభ్యులు ఏదైనా కారణం చేత చనిపోయినా లేదా వైకల్యం సంభవించినా వారికి, వారి కుటుంబాలకు భరోసా ఇచ్చేందుకు ఉచిత బీమా పథకాలను అమలు చేస్తున్నారు. మహిళా స్వయం సహాయక సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు వారి కుటుంబ సభ్యులకు బీమా అందజేస్తారు. అలాగే ఏదైనా ప్రమాదంలో 100శాతం వైకల్యం సంభవించినా రూ.10లక్షల బీమా చెల్లిస్తారు. 50శాతం వైకల్యం చెందితే రూ.5లక్షలు, సహజ మరణం



ఉమ్మడి జిల్లా సంఘాలు, సభ్యుల వివరాలు

జిల్లా	మహిళా సంఘాలు	సభ్యులు
రంగారెడ్డి	19,209	2,06,116
వికారాబాద్	15,622	1,63,452
మేడ్చల్	3,390	36,782

మిగతా 7వ పేజీలో...

సంక్షేమ పథకాలు ఎస్సీలకు అందాలి

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్



మాట్లాడుతున్న వడ్డేపల్లి రాంచందర్

రంగారెడ్డి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ఎస్సీలకు అందేలా చూడాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా, పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్, ఎస్సీ జూనియర్ అడ్వకేట్లకు ప్రోత్సాహకాలు, గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఎస్సీ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు, మంజూరైన నిధుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలలో ఎస్సీలకు సబ్సిడీ యూనిట్ల వివరాలు, ఎస్సీలకు పంపిణీ చేసిన భూముల పరిరక్షణలో రెవెన్యూశాఖ దృష్టి సారించాలని తెలిపారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో ఆయన మొక్కలు నాటారు. ఎస్సీల సంక్షేమానికి అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత, ఎల్బీనగర్ డీసీపీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘పట్టు’ వదిలేశారు!

నిర్లక్ష్యం నీడలో సెరికల్చర్

- 2014 నుంచి కొత్తగా నియామకాల్లేవ్
- వెంటాడుతున్న అధికారుల కొరత
- రైతులకు అవగాహన కల్పించేవారు కరువు
- పడిపోతున్న మల్బరీ సాగు విస్తీర్ణం

షాద్‌నగర్‌రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గంలో మల్బరీ పంటల సాగు ప్రోత్సాహం కరువైంది. రానురాను పంట విస్తీర్ణం పడిపోతుంది. పంట దిగుబడి, లాభనష్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో మల్బరీ సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఉద్యానవన శాఖలో విలీనం చేసిన తర్వాత సెరికల్చర్ నిరాదరణకు గురైందని పలువురు చర్చించుకుంటున్నారు. సెరికల్చర్‌లో రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తరణ అధికారులు లేకపోవడం కారణంగానే సాగు విస్తీర్ణం తగ్గిందని చెప్పవచ్చు.

పోస్టులు ఖాళీగా దర్శనం

సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో 2014 నుంచి ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదంటున్నా... అంతకు ముందు నుంచే పోస్టుల భర్తీ జరగలేదని కొందరు అధికారులు అంటున్నారు. చాలామంది పదవీ విరమణ చేయగా మిగిలిన ఉద్యోగులతోనే నెట్టుకొస్తున్నారు. షాద్‌నగర్ డివిజన్‌లో లింగారెడ్డిగూడ, కమ్మదనంలో మల్బరీ విత్తన క్షేత్రాలు ఉన్నాయి. వీటికి ఒక సెరికల్చర్ ఆఫీసర్, ఇద్దరు అసిస్టెంట్‌లు ఉండాలి. కానీ ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ అన్ని పనులు చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో షాద్‌నగర్ ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో మల్బరీ పంట సాగవుతుండటంతో పట్టణంలోని కేశంపేట రోడ్డులో రీలింగ్ యూనిట్‌ను కూడ ఏర్పాటు చేయడం జరిగింది. దానికి ప్రత్యేకంగా

మిగతా 8వ పేజీలో...



కమ్మదనం నర్సరీలో సాగవుతున్న మల్బరీ తోట

శిథిలావస్థలో భవనాలు

ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ, కమ్మదనం మల్బరీ వ్యవసాయ క్షేత్రాల్లో నిర్మించిన భవనాలు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత లింగారెడ్డిగూడలో ఉన్న ఏడీ కార్యాలయాన్ని మహబూబ్‌నగర్‌కు తరలించారు. అనంతరం కార్యాలయాలు మూతపడ్డాయి. లింగారెడ్డిగూడలో ఓ భవనాన్ని ఆర్‌డీఓ కార్యాలయం కోసం వినియోగించుకుంటున్నారు. మిగతా భవనాలు వృథాగా ఉన్నాయి.

పరమ పావనం.. ఆలయ దర్శనం

పరమ శివుడికి ప్రీతికరమైన కార్తీక మాసంలో ఆచరించే పూజలు, వ్రతాలు పుణ్యఫలాన్నిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ప్రధానంగా కార్తీక పౌర్ణమి రోజున ఆలయాలకు భక్తులు పోటెత్తుతారు. కార్తీక దీపాలు వెలిగించి భక్తిపారవశ్యంలో మునిగితేలుతారు. ఈ రోజున జిల్లావ్యాప్తంగా శివాలయాల తోపాటు ఇబ్రహీంపట్నంలో ప్రధానంగా లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మంచాలలో దక్షిణకాశీగా భాసిల్లుతున్న బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, యాచారం మండలం నందివనపర్తిలో జ్ఞాన సరస్వతి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంటుంది. శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఈ ఆలయాలను ముస్తాబు చేశారు.



7




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అధికారులపై దాడి అమానుషం

- కలెక్టరేట్ ఏవో సునీల్
- కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా

రంగారెడ్డి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అధికారులపై దాడి అమానుషమని కలెక్టరేట్ ఏవో సునీల్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తదితరులపై జరిగిన దాడిని వారు ఖండించారు. రెవెన్యూ సిబ్బందిపై దాడులు ప్రభుత్వం అరికట్టాలని కోరారు. అధికారులపై దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఈ ధర్నాలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోషియేటెడ్ ప్రెసిడెంట్ వెంకటేశం, నాయకులు రామారావు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ధరణి దరఖాస్తులను వచ్చే రెండు నెలల్లో పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సెక్షన్ సూపరింటెండెంట్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 7600 ధరణి దరఖాస్తులను రాబోయే రెండు నెలల్లో పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోజు వారీగా లక్ష్యాన్ని నిర్ణయించుకొని జనవరి 15వ తేదీ లోపు పెండింగ్ లేకుండా పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో సంగీత, ఏవో సునీల్, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



గంజాయి, డ్రగ్స్ వినియోగంపై దృష్టి పెట్టండి

హైదరాబాద్ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):గంజాయి, డ్రగ్స్ వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఉక్కుపాదం మోపాలని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అబ్కారీ భవన్‌లో గురువారం డివిజన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ గురించి ప్రజల్లో మంచి భావన వచ్చేలా పని చేయాలన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, గంజాయి, డ్రగ్స్‌పై నిఘా పెట్టాలని, ఫంక్షన్‌హాళ్లు, ఫామ్‌హౌస్‌ల్లో జరిగే లిక్కర్ పార్టీలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్. సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ఎస్కే.ఫయాజొద్దీన్, కె.నవీన్ కుమార్, ఎన్.క్రిష్ణప్రియ, ఉజ్వలరెడ్డి, విజయ్‌భాస్కర్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల సీఐలు, డీటీఎఫ్ టీమ్‌ల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.







కూలీల కొరత.. పొలంలోనే పత్తి

మర్పల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో దెబ్బతిని కాస్త దిగుబడి వచ్చిన పత్తి పంటకు కూలీల కొరత శాపంగా మారింది. కూలీల కొరత కారణంగా రైతులు పత్తి పంటను పొలాల్లోనే వదిలేసిన దుస్థితి నెలకొంది. మర్పల్లి మండలంలో 3వేల హెక్టార్లకు పైగా పత్తిపంటను రైతులు సాగు చేశారు. ఎకరానికి దాదాపు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టగా పంటసాగు చేసినప్పటి నుంచి అకాల వర్షాలతో పంట ఎర్రబారింది. మొక్కకు దాదాపు 50 నుంచి 100 కాయలు కాయాల్సి ఉండగా 30లోపు పత్తికాయలు కాశాయని రైతులు వాపోయారు. ప్రస్తుతం పత్తిపంట చేతికి రావడంతో కూలీల కొరతతో ఇబ్బందులు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోపత్తిని తీసేందుకు రూ.11నుంచి రూ.15వరకు కూలీ అడుగుతున్నారని, ఇలా అయితే తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. కనీసం పెట్టుబడి రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు దిగులు చెందుతున్నారు. మార్కెట్‌లో పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందనే సాకుతో రూ.7వేలకు క్వింటాలు ధర పలకడం లేదని రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది పత్తి రైతులకు తీరని నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు.



కూలీల కొరతతో పొలంలో వదిలేసిన పత్తి పంట

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా న్యాయసేవ అధికారి, న్యాయమూర్తి డి.బి. శీతల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో గురువారం చిల్డ్రన్స్ డే సందర్భంగా జిల్లా న్యాయసేవ అధికారి, న్యాయమూర్తి డి.బి.శీతల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలో జానవి ప్రథమ బహుమతి, సుప్రియ ద్వితీయ, సుకృతి తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి డీబీ శీతల్ మాట్లాడుతూ.. చిన్నతనమే అందరికీ ప్రియమైనదని, బాల్యాన్ని సరైన రీతిలో ఉపయోగించుకుంటే మంచి భవిష్యత్తు సాధించవచ్చన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా బాల్య వివాహాలు చేయడం నిందించదగ్గ చర్య అని వ్యాఖ్యానించారు. ఇటీవల తన పరిధిలో బాల్య వివాహ కేసులో ఓ బాలికను ఇతర రాష్ట్రానికి పంపగా పోలీసుల సాయంతో 24గంటల్లో చిల్డ్రన్స్ హోంకు తీసుకొచ్చామన్నారు. విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గుర్తించే అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్లు వెంకటేష్, రాము, న్యాయవాది రాజశేఖర్, పాఠశాల హెచ్‌ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు వీరేశం పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా న్యాయసేవ అధికారి, న్యాయమూర్తి డీబీ శీతల్

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి బక్కని నర్సింహులు



దోంగఎన్కేపల్లిలో టీడీపీ సభ్యత్వం చేస్తున్న ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి బక్కని నర్సింహులు

పరిగి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తామని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. దోమ మండలం దొంగఎన్కేపల్లిలో గురువారం టీడీపీ సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల పట్ల ప్రజలు విసుగు చెంది ఉన్నారని తెలిపారు. ఏపీలో సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. తెలంగాణలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఇప్పటికీ కనిపిస్తోందన్నారు. ఈరోజు హైదరా బాద్ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు ఉందంటే అది ఎన్టీఆర్, చంద్రబాబుల పుణ్యమేనన్నారు. టీడీపీలో సభత్వాలు తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. అన్ని గ్రామాలను పర్యటించి సభ్యత్వ కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్, వెంకటేశ్, కో-ఆర్డినేటర్ రాఘవులు, పరిగి మండల ఇన్‌చార్జి సంగం చంద్రశేఖర్, నాయకులు కృష్ణ స్వామి, తామిదాన్ తదితులు పాల్గొన్నారు.

తెగిన ఫిరంగి కాలువ



శంకర్‌పల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వరదొచ్చి తెగిన ఫిరంగి కాలువకు నీటిపారుదల శాఖ అధికారులు మరమ్మతులు చేయించడం లేదని మోకిల రైతులు అన్నారు. తెగిపోయిన కాలువను గురువారం వారు పరిశీలించారు. కాలువ నీటితో పొలాలు ఇసుక మేట వేస్తున్నామని చెప్పారు. పొలాలు దళితులవైనందునే మరమ్మతులు చేయడంలేదని ఆరోపించారు. అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోకిల-పిల్లిగుండ్ల గ్రామాల మధ్య మట్టిరోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు జరిగాయని తెలిపారు. అధికారులు స్పందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కాలేజీ నిర్మాణానికి రూ.25లక్షల విరాళం



రూ.25లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందజేస్తున్న కాశీనాథ్‌రెడ్డి

కొత్తూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి తనవంతు సాయంగా స్వస్తిక్ మిర్చి పరిశ్రమ యాజమాన్యం రూ.25లక్షల రుపాయల విరాళాన్ని ప్రకటించింది. కొత్తూర్‌లో ఎమ్మెల్యే శంకర్‌కు స్వస్తిక్ మిర్చి యాజమాన్యం తరుపున కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి రూ.25లక్షల చెక్కును అందజేశారు. స్వస్తిక్ మిర్చి యాజమాన్యానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడితే అసాధ్యం సుసాధ్యమే

ఇంటర్నేషల్ అథ్లెటిక్ ఛాంపియన్ నందిని

వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కష్టపడితే అసాధ్యం సుసాధ్యమేనని ఇంటర్నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్ నందిని అగసారా అన్నారు. వికారాబాద్ అనంతగిరి పల్లి సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో గురువారం జరిగిన 10వ ఓనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని ఎంత కష్టమైనా ఇష్టంతో సాధన చేసినట్లయితే తప్పనిసరిగా లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గురుకుల పాఠశాలలో ఉన్న సౌకర్యాలు మరెక్కడా ఉండవన్నారు. ఇక్కడ క్రీడల్లో తర్ఫీదు పొందితే జాతీయ స్థాయిలో రాణించగలమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏదైనా పనిచేస్తే పూర్తి ఏకాగ్రతతో, ఇష్టంతో చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారి వెంకటరవణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏదైనా సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడుచుకోవాలని, ప్రతీ ఆలోచన విజయం వైపు దూసుకెళ్లే విధంగా ఉండాలన్నారు. విద్యార్థులు మరింత రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దిశ సభ్యుడు వడ్లనందు, ప్రిన్సిపాల్ రమాదేవి, డాక్టర్ నిఖిల్, పలువురు వ్యాయమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటర్నేషల్ అథ్లెటిక్ ఛాంపియన్ నందిని

కార్మికులకు కనీస వేతనం అందించాలి



యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

నందిగామ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సింబియాసిస్ కళాశాల కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సెక్రటరీ రఘు డిమాండ్ చేశారు. గురువారం మొదళ్లగూడలోని సింబియాసిస్ యూనివర్సిటీ వద్ద కార్మికులు ఆందోళన చేశారు. వేతనాలు పెంచాలని, పని ఒత్తిడి తగ్గించాలన్నారు. ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు వారికి మద్దతిచ్చారు. కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు సరిగ్గా ఇవ్వడం లేదని రఘు యాజామాన్యం దృష్టికి తీసుకెళ్లారు. కాలేజీ ప్రతినిధి వేణుగోపాల్ కాంట్రాక్టర్‌తో మాట్లాడుతానని చెప్పడంతో కార్మికులు వెళ్లిపోయారు. అయితే కార్మికులకు సరైన వేతనాలే ఇస్తున్నామని లేబర్ కాంట్రాక్టర్ తెలిపాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల నవీన్‌గౌడ్, సుదర్శన్, అనిల్‌రెడ్డి, సతీష్, నర్సింహ, శ్రీపతి రెడ్డి, జంగయ్య, శేఖర్‌రెడ్డి, నవీన్, ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు సమష్టి కృషి అవసరం



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటరమణశాస్త్రి

యాచారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఎదుగుదల కోసం తల్లిదండ్రుల శ్రమ వెలకట్టలేనిదని నందివనపర్తి జడ్పీ పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణశాస్త్రి అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషిచేస్తేనే విద్యార్థులు బాగా చదువుతారని చెప్పారు. గురువారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేంలో మాట్లాడారు. ఏడాది పరీక్షలు దగ్గర పడుతున్నందున ఇంట్లో వారికి పనులు చెప్పకుండా చదివించాలన్నారు. పిల్లలకు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను ఇవ్వొద్దని కోరారు. అంతకు ముందు బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. టీచర్లు కిషన్, శిరీష, పద్మ, శ్రీలత, సుధారాణి, పద్మలత, వెంకటేశం, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వ భూములు తీసుకోవాలి



కొడంగల్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములు తీసుకోవద్దని, ప్రభుత్వ భూములు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఆయన కొడంగల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం కొడంగల్ ప్రాంతంలో ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్‌తో పేదరైతుల భూములు తీసుకోవద్దని, కొడంగల్ ప్రాంతంలో ఉన్న 1156 ప్రభుత్వ భూములను తీసుకోవాలన్నారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే కొట్టి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుస్స చంద్రయ్య, మంగమ్మ, నాయకులు శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్

దోమ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మోత్కుర్‌లో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్ బాబు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న ఉమాహారతి

ధారూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. యంగ్ ఓరియంటేషన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌జీవో ఆర్గనైజర్ పవిత్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న దిశా కమిటీ సభ్యుడు వడ్ల నందు

వికారాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని దిశా కమిటీ సభ్యుడు వడ్ల నందు అన్నారు. అనంతగిరిపల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన 10వ జోనల్ క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . విద్యార్థుల క్రీడా అభివృద్ధికి సహకారం అందించే ఉద్దేశంతో వడ్లనందు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు క్రీడా పరికరాలు, బహుమతులను విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, మా శారద ఆస్పత్రి డైరెక్టర్, దిశా జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ రాజశేఖర్, మాజీ సర్పంచులు యాదగిరి, ఆనంద్ పీటి చందర్, వైస్ ప్రిన్సిపల్ జేజే ప్రవీణ్ కుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి



మహనీయులకు నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో గురుకులాల విద్యార్థులు క్రీడాలలో రాణించి, ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కమ్మదనం గురుకుల పాఠశాలలో ఈ నెల 11న ప్రారంభమైన పదో జోనల్ క్రీడలు గురువారం ముగిసాయి. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో బాలికలు ప్రతిభ చూపారని కితాబునిచ్చారు. విజేతలకు అవార్డులందజేశారు. ప్రిన్సిపల్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో నాటిన మొక్కలు నరికివేత



దోమ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మోత్కుర్ గ్రామ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో ఎన్నో రోజుల నుంచి పెంచిన మొక్కలను గొన్నె నాయక్ తండా గ్రామ పంచాయతీకి చెందిన కొందరు వ్యక్తులు చెట్లను నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అదే గ్రామానికి చందు చెట్లు ఎందుకు నరికేస్తున్నారని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి రోడ్డుకు ఇరువైపులా చెట్ల నరికివేతకు గురి చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

'నా భర్తను అన్యాయంగా ఇరికించారు'



పరిగి జైలు వద్ద తన బిడ్డతో అఖిల

పరిగి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తన భర్తను అన్యాయంగా లగచర్ల ఘటనలో ఇరికించారని లగచర్ల గ్రామానికి చెందిన పంచాయితీ కార్యదర్శి రాఘవేందర్ భార్య అఖిల ఆవేదన వ్యక్తం చేసింది. పరిగి సబ్ జైలో ఉన్నతన భర్త రాఘవేందర్‌ను చూడడానికి ఆరు నెలల బిడ్డతో వచ్చింది. భర్తతో ములాఖత్ అయిన తర్వాత బయటకు వచ్చిన అఖిల ఆంధ్రజ్యోతితో కన్నీటిపర్యంతమైంది. లగచర్లలో గొడవ జరిగినప్పుడు తన భర్త గ్రామంలోనే లేరని, పంచాయితీ కార్యదర్శిగా విధులకు వెళ్లారని తెలిపింది. కక్షపూరితంగా కేసు పెట్టి జైలుకు పంపారని వాపోయింది. తన భర్తను అన్యాయంగా జైలుకు పంపారని, రెండు రోజుల నుంచి తండ్రి కనిపించకపోవడంతో తన బిడ్డ ఏడుస్తుందని వాపోయింది. అక్రమంగా పెట్టిన కేసును ఎత్తివేయాలని ఆమె ప్రభుత్వాన్ని వేడుకుంది.

బలవంతంగా భూములు లాక్కోవద్దు



పరిగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలో రైతుల భూములను బలవంతంగా లాక్కోవద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య కోరారు. పరిగిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కలెక్టర్‌పై దాడి జరుగలేదని ప్రకటిస్తే, రైతులకు అక్రమంగా కేసులు పెట్టడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. ఫార్మా కంపెనీల పేరిట గిరిజనుల భూములను లాక్కోవడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, సత్తయ్య, రఘురామ్, శేఖర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



పరమ పావనం..

నేడు కార్తీక పౌర్ణమి

ఆలయ దర్శనం

- కార్తీక మాసంలో భక్తుల ప్రత్యేక పూజలు
- మహిమాన్విత ఆలయాలకు నెలవు ఇబ్రహీంపట్నం ప్రాంతం
- శైవక్షేత్రాలకు పోటెత్తుతున్న జనం
- నేడు ఘనంగా వ్రతాలు, నోములు

ఆదిభట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరమ శివుడికి ప్రీతికరమైన కార్తీక మాసంలో ఆచరించే పూజలు, వ్రతాలు పుణ్యఫలాన్నిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లో హైదరాబాద్‌కు చేరువలో ఉన్న పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఈ ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో ప్రధానంగా లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మంచాలలో దక్షణకాశీగా భాసిల్లుతున్న బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, యాచారం మండలం నందివనపర్తిలో జ్ఞాన సరస్వతి ఆలయం ఉన్నాయి.

దక్షణ కాశీ బుగ్గ క్షేత్రం



ఆరుట్ల బుగ్గ క్షేత్రం

మంచాల మండలం ఆరుట్ల అటవీ ప్రాంతంలో కొండల మధ్య బుగ్గ రామలింగేశ్వరస్వామి క్షేత్రం దక్షణకాశీగా పేరొందింది. ఇక్కడ భక్తులు ఆహ్లాదకర వాతావరణ అనుభూతి పొందుతారు. బండరాళ్ల సొరంగం నుంచి నీటి ప్రవాహం దక్షిణ దిశ నుంచి ఉత్తరానికి, చివరగా తూర్పునకు పారుతోంది. తూర్పు నుంచి వచ్చే మరో ప్రవాహం రెండు దిక్కుల నుంచి వచ్చే నీటితో సంగమం చెంది పడమరకు పారి మళ్లీ దిశ మార్చుకుని తూర్పు కొండల్లో కలుస్తుంది. ఈ నీటిని పవిత్ర జాలంగా భావిస్తారు. ఇలాంటి జలధారలు కాశీ తరువాత ఇక్కడే ఉన్నాయని దక్షణ కాశీగా పిలుస్తారు. కార్తీక మాసంలో పౌర్ణమి నుంచి అమాస వరకు వేలాదిగా భక్తులొచ్చి స్నానమాచరిస్తారు. కాగజ్‌ఘాట్ కొండల్లో స్వయంభూగా వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయం సైతం ప్రాచుర్యం పొందింది. శిలాఫలకం కింద గుడిలో వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు కొలవయ్యారు. ఇదే మండలం తిప్పాయిగూడలో సరళ మైసమ్మ ఆలయం, రాచకొండ శివాలయాన్ని దర్శించుకోవచ్చు.

ఆలయాలకు నెలవు ఇబ్రహీంపట్నం



భూ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఇబ్రహీంపట్నంలో స్వయం భూగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి సజీవమూర్తి అని భక్తుల విశ్వాసం. మధ్యాహ్నపూట గర్భగుడి నుంచి సింహం గాండ్రింపు శబ్దాలొస్తాయని అంటారు. కోదండ రామాలయం, శివాలయం, అనంత పద్మనాభస్వామి, నాగమాత, మల్లికార్జునస్వామి ఆలయాలు కూడా మండలంలో ఉన్నాయి. రాయపోలులో పురాతన ఆలయం ఉంది. పోచారంలో పెద్దవాగు సమీప కొండపై బండరాళ్ల సందులో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి భక్తుల పూజలందుకుంటున్నాడు. కాకతీయల నాటి శైవక్షేత్రం దండుమైలారంలో ఉంది. కాకతీయ రాణి రుద్రమదేవి ఇక్కడ పూజలు చేసిన తరువాతే తన కార్యాలను తలపెట్టేవారి ప్రజలంటారు. మంగల్‌పల్లిలో మమ్మాయి ఆలయం ఉంది. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన రచనకు ముందు ఈ అమ్మవారిని దర్శించుకున్నట్లు చెబుతారు. కప్పాడులో వేంకటేశ్వరస్వామి, మహిమాన్విత త్రిశక్తి ఆలయాలు ఉన్నాయి. అలాగే ద్వాదశ జ్యోతిర్లింగాల శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం, దత్తాత్రేయస్వామి, నాగమాత, గాయిత్రీమాత ఆలయాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి.

నందివనపర్తిలో స్వయం భూ నందీశ్వరాలయం...

యాచారం మండలం ఆలయాలకు ప్రసిద్ధి. యాచారంలో కొండపై తిరుమలానందస్వామిగా వేంకటేశ్వరుడు పూజలందుకుంటున్నాడు. నందివనపర్తిలో ఓంకారేశ్వరుడిని, దేశంలో ఎక్కడా లేని విధంగా స్వయంభూ నందీశ్వరుడిని దర్శించుకోవచ్చు. ఇక్కడికి ప్రతి సోమవారం భక్తులు తరలివస్తారు. ఇక్కడే జ్ఞానసరస్వతి ఆలయం ఉంది. ప్రతీ వసంత పంచమి నాడు చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. విద్యార్థులిచ్చిన డబ్బులతోనే ఇక్కడి మూల విరాట్టు, అమ్మవారికి ఆభరణాలు, ధ్వజస్తంభం చేయించారు. ఆలయ స్థాపకులు సదా వెంకట్‌రెడ్డి పలు విద్యా సంస్థలకు ఇప్పటి వరకు 108 సరస్వతీ మాత విగ్రహాలను అందజేశారు. నల్లవెల్లిలో బొగ్గులగుట్టపై సీతారామచంద్ర స్వామి ఆలయం ప్రసిద్ధిగాంచింది. కొండపై వెలసిన సీతారాములు మరో భద్రాచల రాముడిగా ప్రజలు పిలుచుకుంటారు. అటవీ ప్రాంతంలో తాటికుంట మైసమ్మ ఆలయం ఉంది. ప్రతీ పండుగ పూట ఈ ఆలయాలు భక్తులతో కిటకిటాలాడుతాయి.



నందివనపర్తి జ్ఞాన సరస్వతీ దేవి

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- అధికారులతో జూమ్ మీటింగ్

వికారాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. గురువారం జూమ్ మీటింగ్ ద్వారా ఆయన మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షలు జాగ్రత్తగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతీ సెంటర్‌ను విజిట్‌చేసి సీసీ కెమెరాలు, ఫర్నిచర్, లైట్లు, టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు చెక్ చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దివ్యాంగులైన అభ్యర్థులు ఇతరులచే పరీక్ష రాసేందుకు అనుమతి కోరితే. స్క్రైబ్‌లను పరీక్షకు 24 గంటల ముందు పరిచయం చేయించాలని సూచించారు. అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, అబ్జర్వర్లు, మునిసిపల్ కమిషనర్ జాకీర్‌హుస్సేన్, సూపరింటెండెంట్ నేనావత్ అలీ, అధికారులు పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

గ్రూప్-3 పరీక్షలు సజావుగా నిర్వహించాలి

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలను అధికారులు సమన్వయంతో పనిచేసి సజావుగా జరిగేలా చూడాలని తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. గురువారం ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన గ్రూప్-3 పరీక్షపై సమీక్షా సమావేశంలో మాట్లాడారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ.. ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్-3 పరీక్షలకు ఫ్లయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో హరిప్రియ, అధికారులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో సైదులు అధికారులను ఆదేశించారు. అంకుశాపూర్ ఏసీఈ కళాశాలలో ఏర్పాటు చేయనున్న గ్రూప్-3 పరీక్షా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు రాజేందర్, అధికారులు అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న సీఐ భూపాల్ శ్రీధర్

చేవెళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. గురువారం చేవెళ్లలోని జూనియర్ కళాశాలలో చదవి ప్రతిభ చాటిన విద్యార్థులను అయ్యవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. వారికి ప్రోత్సాహక చెక్కులను అందించారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. ప్రిన్సిపాల్ వెంకటరామారావు మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు అందించడం సంతోషకరమన్నారు. ల్యాబ్‌కు రూ.75వేలు, విద్యార్థులకు రూ.50వేలు ఇచ్చిన ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు గోపాలచారి, శేషాద్రిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కాంచనమాల, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సంధ్యారెడ్డి, రేణుకాచారి, మాణిక్యరెడ్డి, రాజశేఖర్, బాలు, శ్రీనివాస్, ఈశ్వర్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఖోఖోలో ప్రతిభ చాటిన విద్యార్థినికి సన్మానం



స్రవంతిని అభినందిస్తున్న ఎంఈవో సత్యనారాయ, శ్రీనివాస్

కడ్తాల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎంఈవో సత్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ అన్నారు. రావిచెడ్ జెడ్పీ పాఠశాల విద్యార్థిని స్రవంతి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. గురువారం ఎంఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో విద్యార్థులంతా పాస్ కావాలని కోరారు. కార్యక్రమంలో పీడీ మహ్మద్ సాబేర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన విద్యార్థినులకు సత్కారం



స్పందన, భవాని, తేజస్వీని లను సన్మానిస్తున్న శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన వెల్జాల జెడ్పీ పాఠశాల విద్యార్థినులు స్పందన, భవాని, తేజస్వినిలకు గురువారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ హాజరై బాలికలను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్ష ఉపాధ్యాయులు విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా పండిట్ చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ సబ్జెక్ట్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్.శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం, అనంతగిరి రోడ్డులోగల జిల్లా పరిషత్(బాలుర) పాఠశాలలోని కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీమాతో ధీమా

(5వ పేజీ తరువాయి)

పొందితే రూ.2లక్షల బీమాగా అందిస్తారు. చనిపోయిన సభ్యులకు బ్యాంకులో రుణాలు ఉంటే వీటిని కూడా మాఫీ చేస్తారు. గతంలో ఇలాంటి విధానం లేదు. గతంలో రుణాలు తీసుకున్న మహిళా సభ్యురాలు మరణిస్తే బకాయిలన్నీ కుటుంబ సభ్యులే చెల్లించాల్సి వచ్చేది. ఒక వేళ కుటుంబ సభ్యులు చెల్లించకుంటే సంఘంలో ఉన్న సభ్యులపై భారం పడేది. ఈ మొత్తాన్ని సభ్యుల నుంచి వసూలు చేసే వారు. బీమా పథకం అమల్లోకి వచ్చిన తరువాత ఇలాంటి ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. తాజాగా ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బీమా పథకాల ద్వారా ఉమ్మడి జిల్లాలో దాదాపు 5లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. అయితే ప్రమాద బీమా 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్న వారికే వర్తిస్తుంది. ఇదిలా ఉంటే రంగారెడ్డిజిల్లాలో మొత్తం 19,209 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా ఇందులో 2,06,116 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ ఉచిత బీమా పథకాలు వర్తించనున్నాయి. సభ్యులు ఎలాంటి ప్రీమియం చెల్లించనవసరం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళా స్వయం సహాయక సంఘాలపై ఫోకస్ పెంచింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బ్యాంకు లింకేజి ద్వారా ఇచ్చే రుణాలను పెంచింది. అంతేకాక కొత్తగా ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాలను పూర్తిగా మహిళా సంఘాలకే కేటాయిస్తోంది. మహిళా శక్తి పేరుతో అర్హులైన సభ్యులకు వీటిని మంజూరు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 82 మీసేవ కేంద్రాలను మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు.

ఇప్పటికే 69 మంది గుర్తింపు

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మార్చి 3, 2024 నుంచి ప్రభుత్వం ఉచిత బీమా పథకాలను అమల్లోకి తెచ్చింది. ఈ పథకం అమల్లోకి వచ్చిన తరువాత రంగారెడ్డి జిల్లాలో 69 మంది సభ్యులు వివిధ కారణాల వల్ల చనిపోయారు. వీరందరికీ బీమా వర్తింప చేస్తున్నారు. ఇందులో ఐదుగురు ప్రమాదవశాత్తు మరణించగా 64 మంది సహజ మరణం పొందారు. సహజ మరణం పొందిన వారి కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున బీమా అందచేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యారావు తెలిపారు. ఎవరైనా సభ్యులు అకాల మరణం పొందితే అధికారుల దృష్టికి తీసుకువచ్చి బీమా సౌకర్యం పొందాలని సూచించారు.

మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించరూ..

కందుకూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలంటూ మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాచుపల్లి గ్రామస్తులు గురువారం మహేశ్వరం అసిస్టెంట్ డిపో మేనేజర్ అంజమ్మకు వినతి పత్రం ఇచ్చారు. ప్రతీరోజు ఉదయం మండలంలోని మురళీనగర్ నుంచి నేదునూరు ఆదర్శ పాఠశాల వరకు బస్సు వస్తున్నప్పటికీ మా గ్రామానికి వచ్చే సరికి బస్సు పూర్తిగా నిండి పోతుందన్నారు. దీంతో విద్యార్థులు కాలినడకన వెళ్లాల్సి వస్తుందన్నారు. ఉదయం, సాయంత్రం మండల కేంద్రం నుంచి నేదునూరు ఆదర్శ పాఠశాల వరకు వచ్చే బస్సును బాచుపల్లి వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో అసిస్టెంట్ మేనేజర్ స్పందిస్తూ.. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సారమ్మఆరోగ్యరెడ్డి, తమస్‌రెడ్డి, ఎర్ర ప్రభు, కత్తుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చేవెళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారులపై కేసులునమోదు చేస్తామని ట్రాఫిక్ ఇన్‌చార్జీ ఆర్‌ఐ గణేష్ తెలిపారు. గురువారం చేవెళ్లలో వాహనదారులకు అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఆటోలలో పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల డిటెక్టివ్ సీఐ రమేశ్‌నాయుడు, ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల్లో అక్రమాలపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఆమనగల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్యచికిత్స లు చేయించుకున్న పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థికసాయం చెక్కుల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ జిల్లా నాయకుడు తల్లోజు రామకృష్ణ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 2020 నుంచి 2023 వరకు జారీచేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లులో గురువారం జేఏసీ కన్వీనర్ అవ్వారి శివలింగం, ఉద్యమ నాయకుడు పరమేశ్‌లతో విలేకరులతో రామకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన చెక్కులను ఓ మాజీ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసిన కొందరు అక్రమంగా డ్రాచేసుకున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల ఇంటి పేరు పూర్తిగా కాకుండా ఇంగ్లిష్‌లో ఒకే అక్షరంతో ఉండడంతో ఆ పేరుతో ఉన్న వేరే వ్యక్తి బ్యాంక్ ఖాతాలో చెక్కులు జమ చేసుకున్నారని పేర్కొన్నారు. ఇటీవల చెక్కుల బాగోతం బయటపడడంతో అక్రమాలకు పాల్పడ్డ వ్యక్తులు లబ్దిదారులకు డబ్బులు అందజేశారని రామకృష్ణ తెలిపారు. ఏ బ్యాంక్ అకౌంట్ల నుంచి డ్రా చేశారో విచారణ జరిపితే అక్రమాలు వెలుగుచూస్తాయని రామకృష్ణ అన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల అక్రమాలపై సీఎం ఓఎస్‌డీకి, ప్రిన్సిపల్ సెక్రెటరీ(సీఎంఆర్ఎఫ్) నవీన్ మిట్టల్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ప్రయాణికులకు నీడ కరువు

- ఎండావానల్లో రోడ్డుపైనే వేచి ఉంటున్న విద్యార్థులు, ప్రజలు
- బస్ షెల్టర్లను పట్టించుకోని అధికారులు



అమ్డాపూర్ చౌరస్తా వద్ద బస్సు కోసం ఎండలో రోడ్డుపై వేచి చూస్తున్న విద్యార్థులు

మొయినాబాద్ రూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న విద్యార్థులు, సాధారణ ప్రయాణికుల పరిస్థితి దయనీయంగా మారింది. వారు గంటల తరబడి బస్‌స్టాపుల్లో వేచి ఉంటున్నారు. బస్‌షెల్టర్లలో కూర్చునేందుకు చోటులేక ఎండలో ఉంటున్నారు. మొయినాబాద్ మండలంలో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై రోజూ ఇదే పరిస్థితి నెలకుంటోంది. నగర శివారుల్లో ఇంజినీరింగ్ కాలేజీలు, స్కూళ్లలో వేలాది మంది విద్యార్థులు చదువుతూ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. విద్యా సంస్థల సిబ్బందీ బస్సుల్లోనే విధులకు హాజరవుతారు. గతంలో పోలిస్తే ఇప్పుడు బస్సు సర్వీసుల సంఖ్య కుదించారు. విద్యార్థులు బస్సుల కోసం ఎండ, వానల్లో రోడ్డుపై వేచి ఉంటున్నారు. అక్కడక్కడ షెల్టర్లు ఉన్నా అవి ఏమాత్రం సరిపోవడం లేదు.

బస్ షెల్టర్లలో అసాంఘిక కార్యకలాపాలు

వేలాది మంది విద్యార్థులు, స్థానికు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. బస్‌స్టాపుల్లో వసతుల్లేక అవస్థ పడుతున్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై, రాణేఇంజిన్ వాల్యు కంపెనీ, గండిపేట చౌరస్తా, అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, జేబీఐఈటీ అమ్డాపూర్ చౌరస్తా, మొయినాబాద్, కనకమామిడి చౌరస్తాలు, చిన్నషాపూర్‌గేట్, కేతిరెడ్డిపల్లి, తోలుకట్ట చౌరస్తాల్లోని బస్‌షెల్టర్లు నిర్వహణ లేక అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారాయి.

బస్ షెల్టర్లను శుభ్రం చేయించాలి



ప్రయాణికులు బస్‌షెల్టర్లలో నిల్చోలేక రోడ్డుపై వేచి ఉంటున్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై 8 చౌరస్తాలున్నాయి. ఈ చౌరస్తాల్లో బస్‌షెల్టర్లు నిర్మించినా అవి వినియోగంలో లేవు. వాటిని శుభ్రం చేయించాలని అధికారులకు కోరినా పట్టించుకోవడం లేదు. కొన్ని స్టాపుల్లో బస్సులు నిలవడమే లేదు.

- గంగాపురం సుధాకర్‌రెడ్డి, కాశింబౌళి

కనీస వసతులు కల్పించాలి



బస్టాపుల్లో చెత్తతో నిండిపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై ఉంటూ బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్లకు మరమ్మతులు చేయించాలి. హైదరాబాద్ వెళ్లేందుకు మాకు బస్సులే దిక్కు. ఇప్పటికైనా అధికారులు చౌరస్తాల వద్ద బస్సులు నిలిపే విధంగా చూడాలి.

- కురుమ మధు, నక్కలపల్లి

కొత్తూర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కొత్తూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన కొత్తూర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. రూ.18కోట్లతో నిర్మించతలపెట్టిన కొత్తూర్-వినాయక స్టీల్ చౌరస్తా బీటీ రోడ్డు పనులు, 32కోట్ల రుపాయలతో తలపెట్టిన కొత్తూర్-కుమ్మరిగూడ బీటీ రోడ్డు పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా తేడాలున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది చేసి చూపెడుతుందన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలో అన్ని రోడ్లను తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్‌ఛైర్మన్ రవీందర్, కౌన్సిలర్ సోమ్లనాయక్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కాంగ్రెస్ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.ఆయా

క్రైం కార్నర్

స్కూటీని ఢీకొట్టిన పెళ్లి బృందం బస్సు

- భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు



మృతిచెందిన మంజుల(ఫైల్)

చేవెళ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యభర్తలు ఇద్దరు స్కూటీపై బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పెళ్లి బృందం బస్సు వారిని ఢీకొనడంతో భార్య మృతిచెందగా, భర్త కాళ్లు విరిగాయి. ఈ ఘటన గురువారం ఉదయం చేవెళ్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన మొండివాగు అశోక్, మంజుల(43) దంపతులు. వీరు మొయినాబాద్ మండలం నక్కలపల్లిలోని బంధువుల ఇంటికి బుధవారం వెళ్లి రాత్రి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం కొత్తపల్లికి స్కూటీపై వస్తున్నారు. చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ వద్ద స్కూటీని యూటర్న్ చేస్తుండగా శంకర్‌పల్లి నుంచి షాబాద్ వెళ్తున్న పెళ్లి బృందం బస్సు(అలీం టూరిస్ట్ బస్సు) ఢీకొట్టింది. దీంతో మంజుల బస్సు కిందపడిపోయింది. ఆమెను బస్సు కొద్దిదూరం ఈడ్చుకెళ్లగా శరీరం ఛిద్రమై అక్కడిక్కడే మృతి చెందింది. అశోక్ రెండు కాళ్లు విరిగాయి. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి విషమంగానే ఉంది. మంజుల కోడలు ప్రవళిక ఫిర్యాదు మేరకు చేవెళ్ల ఎస్సై సంతోష్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఢీకొట్టిన పెళ్లి బృందం బస్సు

డివైడర్‌ను ఢీకొట్టిన కారు.. డ్రైవర్ దుర్మరణం

శంషాబాద్ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్ మృతిచెందిన సంఘటన గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కారు(టీఎస్08 యూఏ8729)లో ఓ ప్రయాణికుడితో ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. మహారాష్ట్రకు చెందిన పఠాన్ అమీర్‌ఖాన్ పదేళ్లుగా క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ మైలార్‌దేవ్‌పల్లిలో ఉంటున్నాడు. గురువారం ఉదయం అమీర్‌ఖాన్ కారులో ప్రయాణికులను ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్తుండగా ఎయిర్‌పోర్టు సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో పఠాన్ అమీర్‌ఖాన్(31) అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



లావణ్య

శంకర్‌పల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లిన ఘటన మోకిల పరిధిలో జరిగింది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. లావణ్య అనే మహిళ వివాహమైనా తల్లిగారిల్లు జన్వా డలోనే ఉంటోంది. ఆమె తండ్రి శంకరయ్య ఈ నెల 12న పనినిమిత్తం బయటకి వెళ్లి సాయం త్రం వచ్చేసరికి కూతురు లేదు. దీంతో ఆయన ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శంకరయ్య గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): వెల్జాల్‌కు చెందిన రామచంద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం ఆమె మృతదేహానికి కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ కేశవరెడ్డి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు అంజయ్యగౌడ్, అంబాజీ, రమేశ్‌యాదవ్, నర్సింహులు, అజీజ్, ఆరిఫ్, వెంకట్‌రెడ్డి, దశరథం, రవీందర్‌గౌడ్, లింగం, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

మంచాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ మండల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మర్పల్లి అంజయ్యయాదవ్ అన్నారు. బీజేపీ మండల బూత్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. అంజయ్యయాదవ్ మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో 200చొప్పున సభ్యత్వ నమోదు చేయాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాషయ్య, శ్రీశైలం, జనార్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజు, రాజేందర్‌రెడ్డి, బండిరాజు, పాండు, ఐలయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

రైతుల అభివృద్ధే సహకార సంఘం లక్ష్యం

కందుకూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): రైతులు అన్ని రంగాల్లో రాణించేందుకు సహకార సంఘం రుణం ఇస్తుందని ప్యాక్స్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం సహకార వారోత్సవాలను పురస్కరించుకొని ఆ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఇస్తామన్నారు. వైఎస్ ఛైర్మన్ జి.విజయేందర్‌రెడ్డి, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, రాములు, వెంకట్‌రాంరెడ్డి, చంద్రునాయక్, పొట్టి ఆనంద్, కార్యదర్శి యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



కొత్తూరు: కుమ్మరిగూడలో బాలికలకు మిఠాయిలు తినిపిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్/షాద్‌నగర్/చౌదరిగూడ/ఇబ్రహీంపట్నం/యాచారం/చేవెళ్ల/కేశంపేట/షాబాద్/ఆదిభట్ల/ఆమనగల్లు/తలకొండపల్లి/కడ్తాల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తూర్, మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో గురువారం భారత మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయ ంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేశారు. కుమ్మరిగూడ పాఠశాలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యార్థులకు మిఠాయి పంచారు. మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, కౌన్సిలర్ మాధవిగోపాల్‌గౌడ్, హెచ్ఎం భాస్కర్, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, మహేందర్, సురేందర్, ఎమ్మె సత్తయ్య, దయానంద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. అలాగే షాద్‌నగర్‌లోని బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ హాజరయ్యారు. కొందు ర్గు, జిల్లేడు చౌదరిగూడల్లో నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఇబ్రహీంపట్నం బాలికల పాఠశాలలో బాలికలు వివిధ రాష్ట్రాల మహిళల వేషధారణలో అలరించారు. హెచ్ఎం లావణ్య, టీచర్లు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమానికి యాచారం మండలం గున్గల్ మోడల్ స్కూల్ బాలికలు 150మంది వెళ్లారు. వారితో తహసీల్దార్ అయ్యప్ప, ఎంఈవో పాండురంగారెడ్డి, ఎస్సై మధు, ప్రిన్సిపాల్ ఎమీమా ఉన్నారు. ఎల్బీ స్టేడియానికి చేవెళ్ల మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులను మూడు బస్సుల్లో తరలించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈవో పురందాస్ విద్యార్థులతో ఉన్నారు. కేశంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు. పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, కరుణాకర్‌రెడ్డి, పర్వతాలు, రాములు, బి.రాజేందర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, అనసూయమ్మ, బాల్‌రాజ్, రమేష్ పాల్గొన్నారు. ఆదిబట్ల పరిధి పాఠశాలల్లో చిల్డ్రన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆదిభట్ల ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పరమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే భవిష్యత్తు ఉంటుందని షాబాద్‌లోని అక్షర టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ రాజుగౌడ్ అన్నారు. నెహ్రూ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆమనగల్లులో రాజీవ్‌చౌక్ వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, నాయకులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఖాదర్, మైసయ్య, శ్రీశైలం, ప్రసాద్, జె.యాదయ్య, రాజశేఖర్, వస్పుల శ్రీకాంత్, సురేశ్, కరీం, మహేశ్, సత్యం, పరమేశ్, శివ, ఫిరోజ్, ఫరీద్, శ్రీశైలం, నర్సింహ, కిషన్ పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, వివిధ విభాగాల నాయకులు అజీం, రవీందర్, ఆరిఫ్, శేఖర్, బాల్‌రాజ్, నర్సింహ, శ్రీను, సురేశ్, యాదగిరి, గణేశ్, మైసయ్య పాల్గొన్నారు. వెల్జాలలోని జెడ్పీ పాఠశాలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్ యాదవ్ నెహ్రూ ఫొటోకు పూలమాల వేశారు. జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు ముజూబుర్ రెహెమాన్, హెచ్ఎం నసీమ్‌సుల్తానా, టీచర్లు కేశవులు, శ్రీదేవి, కల్పన, పూర్ణిమ, ఆదర్శరావు, శేఖర్, శోభ, బాలకృష్ణ, ఆసియ, చంద్రకళ, పీడీ పరమేశ్ పాల్గొన్నారు. కడ్తాలలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాఘవేందర్ నాయకులు, యువజన సంఘాల సభ్యులు నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు పలకలు, పండ్లు, విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.



ఆమనగల్లులో నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జగన్, నాయకులు



షాబాద్: నాగర్‌గూడలో అక్షర టాలెంట్ స్కూల్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



తలకొండపల్లిలో నెహ్రూ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు

చిరు వ్యాపారులకే దుకాణాలు కేటాయించాలి

కడ్తాల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కడ్తాలలోని పాల శీతలీకరణ కేంద్రం వద్ద నిర్మించిన పది షెటర్లను స్థానిక చిరువ్యాపారులకు కేటాయించాలని యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ కోరారు. గురువారం తహసీల్దార్ ముంతాజ్‌కు, చిల్లింగ్ సెంటర్ పర్యవేక్షకుడు రాములుకు వినతిపత్రాలందించారు. టెండర్ పద్ధతిన దుకాణాలు కేటాయిస్తే చిరువ్యాపారులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, యాదగిరి, వెంకటేష్, ప్రేమ్‌రాజ్, పురుషోత్తం, గణేష్, మహేష్, సాయిలు, మురళి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం చేయించాలి

షాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులకు సకాలంలో వైద్యం చేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సోలిపేట్‌లో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. గేదెలకు చికిత్సలు, చూడు పరీక్షలు, నట్టల నివారణ మందులు వేశారు. ఆయన మాట్లాడుతూ.. పశువులకు సరైన సమయంలో చికిత్సలు చేయించాలన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్, సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్, రైతులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందిస్తాం

చౌదరిగూడ,నవంబరు 14: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహాయ అందిస్తామని ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ మేనేజర్ సంపత్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడలోని ఉన్నత పాఠశాలలో ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో రూ.7లక్షలతో నిర్మించి టాయిలెట్స్, మురుగుదొడ్లను తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, జీహెచ్ఎం సునీత, సీఎస్ఆర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం

కడ్తాల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యే ప్రగతికి, సామాజిక మార్పునకు మూలాధారమని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలన్నారు. కడ్తాల కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం విద్యార్థినులకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్టీల్‌ప్లేట్లను ఇచ్చారు. దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎస్‌వో అనిత 220మంది విద్యార్థినులకు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు మంగళపల్లి నర్సింహ్మా, లక్ష్మణాచారి, పాండు, రామచంద్రయ్య, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీను, రాజు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత

మాడ్గుల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సుద్దపల్లిలోని హనుమాన్ ఆలయం అభివృద్ధికి గ్రామస్తులు, దాతల సహకారం అవసరమని హరహర క్షేత్ర వేంకటేశ్వరకస్వామి ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ కావేటి సుధాశ్రీనివాస్‌రావు అన్నారు. ఈ మేరకు గ్రామస్తులు వారిని కలిశారు. ఆలయాన్ని పునర్నిర్మాణానికి దేవరకొండ రాఘవులు, సత్యం, మాజీ సర్పంచ్ అడ్వకేట్ జానకిరామ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్యలు వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణదాత కావేటి శ్రీనివాసరావును సంప్రదించారు. ఈ మేరకు ఆయన రూ.1,10,116 విరాళాన్ని అందజేశారు.

ఇంటి యజమానులతో మాట్లాడి వివరాలు తీసుకోవాలి

యాచారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేలో విధిగా ఇంటి యజమానులతో మాట్లాడి కుటుంబాల వివరాలు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మంతన్‌గౌరెల్లిలో సర్వే తీరును పరిశీలించారు. ప్రభుత్వ ఇచ్చిన ఫామ్‌లో ఉన్న వివరాలను పకాగా నమోదు చేసుకోవాలన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లేషం

శంకర్‌పల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ (ఫెడరేషన్) జిల్లా ఉపాధ్యక్షుడుగా మల్లేషం ఎంపికయ్యారు. శంకర్‌పల్లి పరిధి సింగాపురం మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మురహరి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ సంఘం కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తున్నదన్నారు. మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎనిమిది నెలల జీతాలు రూ.9కోట్లు మంజూరయ్యేలా పాటుపడ్డామన్నారు. మల్లేషం మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శరణ్యరెడ్డి తదితరులు ఉన్నారు.



మల్లేషంకు నియామక పత్రాన్ని అందజేస్తున్న మురహరి

అధికారులపై దాడి హేయం

మొయినాబాద్ రూరల్/షాద్‌నగర్,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కడా ప్రత్యేక అధికారి, తహసీల్దార్, సిబ్బందిపై లగచర్లలో దాడికి పాల్పడడం హేయమైన చర్య అని, ప్రభుత్వం దోషులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర తహసీల్దార్ల సంఘం(ట్రెసా) ప్రధానకార్యదర్శి, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలను అధికారులు పాటిస్తారని, అధికారులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అధికారులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో ఆధ్వర్యంలో షాద్‌నగర్ తహసీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కమిషనర్ వెంకట్‌రెడ్డి తదిరులపై జరిగిన దాడిని ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవో నాయకులు తీవ్రంగా ఖండించారు. సిబ్బందిపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

శంకర్‌పల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేష్ తెలిపారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన డ్రైవర్లు ఖచ్చితంగా యూనిఫామ్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్‌తో పాటు సీటుబెల్టు పెట్టుకోవాలని అన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపొద్దని, ట్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి, మోకిల సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

శంకర్‌పల్లి నవంబరు 14(ఆంధ్రజ్యోతి):రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మోకిల సొసైటీ ఛైర్మన్ గోపాల్ తెలిపారు. మోకిల రైతువేదిక వద్ద గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వడ్లను ఎండబోయకుంటే గింజల రంగుమారి నాణ్యత తగ్గుతుందని, అందుకే పూర్తిగా ఎండిన వడ్లనే కేంద్రాలకు తేవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ శశిధర్‌రెడ్డి, చేవెళ్ల ఏడీఏ సురేష్, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, శంకర్‌పల్లి ఏవో చైతన్య, ఏఈవో రామక్రిష్టారెడ్డి, మోకిల సొసైటీ సీఈవో వేణు, నాయకులు యాదయ్య, రాములు, సత్యం, లింగం, వెంకటయ్య, గోపాలచారి, పీఏస్ ఎల్లయ్య పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేశంపేట: కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(ప్యాక్స్) ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభిస్తారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ విరేశ్, ప్యాక్స్ సీఈవో అనిల్‌కుమార్ గురువారం వేర్వేరుగా తెలిపారు. కొత్తపేట, కేశంపేట, తొమ్మిదిరేకుల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలన ప్రారంభిస్తున్నాట్లు వారు వివరించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాల పట్ల ప్రతొక్కరు అప్రమత్తంగా ఉండాలని ఆన్‌లైన్, ఇంటర్నెట్‌లను విజ్ఞానం కోసం ఉపయోగించుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి శంకర్‌శ్రీదేవి అన్నారు. విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలని, చాటింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. గురువారం శేరిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. సైబర్ మోసాలు ఎక్కువయ్యాయని, ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటేనే వీటిని అరికట్టొచ్చన్నారు. డిజిటల్ విధానంతో బోధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కోసం నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్, పాఠశాల ప్రధానోపాధ్యాడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి

'పట్టు' వదిలేశారు!

(5వ పేజీ తరువాయి)

అధికారి ఉండేవారు. ప్రస్తుతం రోలింగ్ యూనిట్ అధికారి ప్రమోషన్‌పైవెళ్లడంతో వికారాబాద్‌లో పనిచేసేవారికి ఇన్‌చార్జి బాధ్యతలప్పగించారు. మల్బరీ విత్తన క్షేత్రాల్లో రెగ్యులర్ ఉద్యోగులు లేక దినసరి కూలీలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం వారు కూడా అందుబాటులో లేరు.

ఉన్న ఒక్క ఉద్యోగి స్థానంలో మరొకరు విధులు

కమ్మదనం మల్బరీ విత్తన క్షేత్రంలో ఇద్దరు ఉద్యోగులు ఉండగా వారిలో యాదయ్య అనే ఉద్యోగి రిటైర్ అయ్యారు. ఉన్న ఒక్క ఉద్యోగి బాలయ్య ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆయనకు బదులు యాదయ్య విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పుడైనా రైతులు మల్బరీ విత్తనాల కోసం వస్తే వాళ్లే వాటిని కోసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

జిల్లాలో 320ఎకరాలు.. షాద్‌నగర్‌లో 40ఎకరాలు

గతంలో వందల ఎకరాల్లో మల్బరీ తోటలు సాగయ్యేవి. ప్రస్తుతం సాగు పడిపోయింది. జిల్లాలో 320 ఎకరాలు సాగవుతుండగా షాద్‌నగర్ డివిజన్‌లో 40ఎకరాలు సాగవుతోంది. ఒకప్పుడు మల్బరీ రైతులు వద్దకు అసిస్టెంట్లు వెళ్లి గుడ్ల నుంచి పంట చేతికొచ్చేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు గురించి వివరించేవారు.ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా రైతులకు అవగాహన కల్పించే వారే లేకుండా పోయారు.


పెండింగ్‌లోనే రూ.3.5కోట్ల ఇన్సెంటివ్

మల్బరీ రైతులకు ఉమ్మడి రాష్ట్రంలో కిలోకు రూ.50ఇన్సెంటివ్ ఇచ్చేవారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మాజీ మంత్రి హరీష్‌రావును పట్టుకు మద్దతు ధర కల్పించాలని రైతులు కోరగా కిలోకు రూ.75ఇన్సెంటివ్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆరు నెలలు ఇచ్చారు. తర్వాత ఇవ్వడంలేదని రైతులు వాపోతున్నారు. రైతులు ఆందోళన చేస్తామని హెచ్చరించడంతో ప్రభుత్వం రూ.రెండు కోట్లు ఇచ్చింది. మిగతా ఇన్సెంటివ్ ఇవ్వాల్సి ఉంది.

షెడ్ల నిర్మాణానికి దక్కని రాష్ట్రం వాటా..

పట్టు పురుగుల పెంపకం కోసం నిర్మించే షెడ్ల నిర్మాణానికి ఇవ్వాల్సిన రాష్ట్రం వాటా అందడం లేదు. షెడ్డు నిర్మాణం రూ.4లక్షలతో నిర్మించాల్సి ఉంటుంది. అందులో రూ.2లక్షలు కేంద్ర ప్రభుత్వం, లక్ష రాష్ట్ర ప్రభుత్వం, లక్ష రైతు వాటాగా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నా రాష్ట్ర వాటా రావడం లేదని రైతులు తెలిపారు. ఇప్పటి వరకు 20మంది వరకు రైతులు షెడ్లు నిర్మించుకొని రాష్ట్రం వాటా కోసం ఎదురు చూస్తున్నారు.

మూడు నెలల నుంచి జీతాల్లేవ్



మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదు. పూట గడవడం కష్టంగా మారింది. పని భారం కూడ ఎక్కువైంది. నెల నెలా జీతాలు ఇవ్వాలి.

- నీలమ్మ, రోలింగ్ ఉద్యోగి

పదవీ విరమణ సమయంలో భరోసా ఇవ్వాలి



ఏళ్ల తరబడి పని చేసినా పదవీ విరమణ సమయంలో ఉత్త చేతులతో ఇంటికి పోవాల్సి వస్తుంది. దీంతో భవిష్యత్తు ఆందోళనకరంగా ఉంది. మాకు ప్రభుత్వం ఆసరా కల్పించాలి. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మా పరిస్థితిపై ఆలోచించాలి.

- కేశవులు, రోలింగ్ వర్కర్- షాద్‌నగర్

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తోటల విస్తీర్ణం పెంచేలా కోరుతున్నాం. సిబ్బంది లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది కలుగుతోంది. అయినా నా వంతు కృషి చేస్తున్నా.

- ముత్యాలు, అసిస్టెంట్ డైరెక్టర్

సంక్షిప్తంగా

ఆమనగల్లు కేజీబీవీలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థినులకు బోధించిన తీరు చూపరులను ముచ్చట గొలిపింది. స్వపరి పాలనలో భాగంగా ఎస్.పూజ కలెక్టర్‌గా, శ్రావణి డీఈవోగా, మల్లిక జీసీడీవోగా, శిరీష ఎంఈవోగా, హారిక ఎస్‌వోగా వ్యవహరించారు. సాయంత్రం పాఠశాల ఎస్‌వో పద్మజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి

కడ్తాల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యువత వ్యాపార రంగంలో రాణించాలని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా యువత ఉపాధి పొందుతూ మరికొందరు నిరుద్యోగులకు ఉపాధిచూపాలని ఆయన కోరారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామానికిచెందిన కేతావత్ సక్రు నాయక్ ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని స్థానిక నాయకులతో కలిసి గురువారం శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు పెద్ద పీట వేస్తుందన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సక్రి, నాయకులు సోమ్లనాయక్, కృష్ణనాయక్, రాము నాయక్, రాందాస్ నాయక్, సుమన్, హరినాయక్ పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు పోరాటం ఉధృతం

తలకొండపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 14వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు , ప్రజా సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావ్‌పేట, ఖానాపూర్,మెదక్‌పల్లి, వీరన్నపల్లి, గౌరిపల్లి, బల్సుపల్లి తండా, చౌదర్‌పల్లి, కేపీ తండాలను కలిపి గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. మండలంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవిలు మండల కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. దీక్షలో జేఏసీ ఛైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ ఛైర్మన్ శరత్‌చంద్ర, మోహన్, శ్రీను, అంజినాయక్, లక్యానాయక్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.